క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని శాలిపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు నిర్వహిస్తున్నందున శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సతీశ్ బాబు తెలిపారు. శాలిపేట, చెన్నాయిపల్లి, ఖాజాపూర్ గ్రామాలలో శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపేలా చూడండి



రఘునందన్‌రావును సత్కరిస్తున్న బీజేపీ నేతలు

మనోహరాబాద్(తూప్రాన్): స్థానిక రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాప్ ఏర్పాటుకు కృషిచేయాలని ఎంపీ రఘునందన్‌రావుకు బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం మండల బీజేపీ నాయకులు అజయ్ కుమార్ లక్ష్మణసింగ్ ఠాకూర్, నరేశ్ ఆయన నివాసంలో కలిశారు. పరిశ్రమల వాడ కావడంతో ప్రయాణికులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారని, వారి కోసం స్టాప్ ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ఆయనను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు.

రైతులకు విత్తనాలపై అవగాహన



విత్తనాలు అందజేస్తున్న ఎంపీపీ శ్రీనివాస్

చేగుంట(తూప్రాన్): రైతులు ప్రభుత్వం సూచించిన విత్తనాలనే వాడాలని ఎంపీపీ మాసుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన పలు విత్తన దుకాణాల వద్ద రైతులకు విత్తనాలపై అవగాహన కల్పించారు. రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలుచేస్తే రసీదులు కచ్చితంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గణేశ్, భూషణం, సంతోష్, శ్రీకాంత్ ఉన్నారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులు

మనోహరాబాద్(తూప్రాన్): మనోహరాబాద్ మండలం రంగాయపల్లి ఉన్నత పాఠశాలలో చదువుతున్న బాలికలు గీతాశ్రీ, అర్చన, లిఖిత నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు హెచ్‌ఎం సంజీవరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు నిర్వహించిన ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ పరీక్షలో తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారన్నారు. ఇంటర్మీడియెట్ పూర్తయ్యే వరకు వారికి ఏడాదికి రూ.7,200 అందజేస్తారని చెప్పారు.

విద్యాహక్కు చట్టం అమలు చేయాలి

మాల మహానాడు నేత నరేశ్



వినతిపత్రం అందజేస్తున్న నరేశ్ తదితరులు

నర్సాపూర్: విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని మాల మహానాడు జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు నరేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఎంఈఓ బుచ్చానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ప్రైవేటు పాఠశాలల్లో 25శాతం సీట్లు ఉచితంగా కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మండలంలో అమలు కాకపోవడంతో పేదల పిల్లలు విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ ఫైల్ తప్పనిసరి

పెద్దశంకరంపేట(మెదక్): రిటైర్డు ఉద్యోగులు ఈ ఫైల్ తప్పకుండా చేసుకోవాలని రిటైర్డు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎస్.నర్సింహులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24కుగాను ఈ నెల చివరిలోగా ఛార్టెడ్ అకౌంటెంట్ ద్వారా ఈ ఫైల్ చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు స్థానిక రిటైర్డు ఉద్యోగుల సంఘం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

సిబ్బందిలేక ఇబ్బందులు

- ఖాళీగా వైద్యుల పోస్టులు
- డిప్యూటేషన్‌పై కొందరు దూరం
- అందని స్పెషలిస్టుల సేవలు
- పేదలకు భారమైన మందులు



స్కానింగ్ కోసం నిరీక్షిస్తున్న మహిళలు

నియోజకవర్గ కేంద్రమైన నర్సాపూర్‌లోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్యుల పోస్టులలో సగం వరకు ఖాళీగా ఉన్నాయి. స్పెషలిస్టుల పోస్టులు కొన్ని ఖాళీగా ఉండగా కొందరిని డిప్యూటేషన్‌పై ఇతర ఆసుపత్రులకు పంపడంతో ఇక్కడి ప్రజలకు స్పెషలిస్టుల సేవలు అందడం లేదు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో 22 మంది వైద్యులకు గాను పది మంది వైద్యులు విధులు నిర్వహిస్తున్నారు. నలుగురు వైద్యులను డిప్యూటేషన్‌పై ఇతర ఆసుపత్రులకు పంపగా మరో ఎనిమిది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సివిల్ అసిస్టెంటు సర్జన్ల పోస్టులన్నీ ఖాళీగానే ఉండడం గమనార్హం

– నర్సాపూర్

అందని స్పెషలిస్టుల సేవలు

ఆసుపత్రిలో రేడియాలజిస్టు, ఆర్థోపెడిక్, ఫోరెన్సిక్, కంటి స్పెషలిస్టులతో పాటు ఇతర విభాగాల స్పెషలిస్టులు అందుబాటులో లేరు. వారిలో కొందరిని మెదక్, తూప్రాన్ ఆసుపత్రులకు డిప్యూటేషన్‌పై పంపగా కొన్ని పోస్టులు ఖాళీ ఏర్పడ్డాయి. దీంతో స్థానిక ఆసుపత్రికి వచ్చే రోగులకు ఆయా స్పెషలిస్టుల సేవలు అందక ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. రేడియాలజిస్టు ప్రతి శుక్రవారం ఇతర ఆసుపత్రి నుంచి డిప్యూటేషన్‌పై స్థానిక ఆసుపత్రికి వచ్చి టెస్టులు చేస్తున్నారు. ప్రధానంగా గర్భిణులు ప్రతి శుక్రవారం 50మందికి పైగానే స్కానింగ్ కోసం వస్తున్నారు. ఇతర రోజులలో స్కానింగ్ అవసరమైతే గర్భిణులకు ప్రైవేటే దిక్కవుతోంది. దీంతో ఆర్థిక భారం పడుతోందని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆర్థోపెడిక్ వైద్యం శూన్యం

ఆపరేషన్ థియేటర్ లేదన్న సాకుతో ఆర్థోపెడిక్ వైద్యుడిని డిప్యూటేషన్‌పై మెదక్‌కు పంపారు. దీంతో స్థానికులకు ఎముకలకు సంబధించిన వైద్యం అందకుండా పోయింది. ఆర్థోపెడిక్ విభాగంలో ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేసి సేవలందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. పూర్తి స్థాయిలో వైద్యులను నియమించాలని కోరుతున్నారు.

ఆయూష్ విభాగానికి తాళం

సుమారు మూడేళ్లుగా ఆయుర్వేదిక్ డాక్టర్ పోస్టు ఖాళీగా ఉండడంతో ఆయూష్ విభాగం గదికి తాళం వేశారు. మూడేళ్ల నుంచి ప్రజలకు ఆయుర్వేద వైద్యం అందకుండా పోయింది.

ఎంసీహెచ్ కిట్లు కొరత

డెలివరీ అయిన మహిళలు, నవజాత శిశువులకు అవసరమైన ఎంసీహెచ్ కిట్స్ ప్రభుత్వం అందజేసేది. రెండు నెలల నుంచి ఆ కిట్లు కూడా అందడంలేదని సమాచారం. స్టాకు లేనందున ఇవ్వడం లేదని సిబ్బంది చెపుతున్నారు. ఇప్పటి వరకు సుమారు రెండు వందల మందికి కిట్లు ఇవ్వాల్సి ఉందని చెబుతున్నారు.

పోస్టుమార్టం కిట్ కూడా భారం

పోస్టుమార్టం కిట్లు కూడా అందడంలేదని ప్రజలు వాపోతున్నారు. ఈ కిట్ కోసం మార్కెట్‌లో రూ.1500 వరకు ఖర్చుచేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో మందుల కోసం ప్రభుత్వం నెలనెలా లక్షల రూపాయలు వ్యయం చేస్తున్నప్పటికీ పోస్టుమార్టం కిట్లలను అందుబాటులో ఉంచకపోవడంపై పేదప్రజల నుంచి నిరసనలు వ్యక్తం అవుతున్నాయి.

నా దృష్టికి రాలేదు



పోస్టుమార్టం కిట్‌ను బయట కొనుగోలుచేసి తెచ్చుకుంటున్న విషయం నాకు తెలియదు. పోస్టుమార్టం చేసేందుకు అవసరమయ్యే పరికరాలు ఆసుపత్రిలో అందుబాటులోనే ఉన్నాయి. బయటి నుంచి ఎందుకు కొనుగోలుచేసి తెస్తున్నారో తెలియదు. దీనిపై విచారణచేసి చర్యలు తీసుకుంటాను. అలాగే అన్నిరకాల మందులు అందుబాటులో ఉన్నాయి. ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టుల వివరాలు ఉన్నతాధికారులకు తెలిపాను. ప్రభుత్వం భర్తీ చేయగానే అందుబాటులోకి వస్తారు.

– డాక్టర్ పావని, ఆసుపత్రి సూపరింటెండెంట్

మంత్రి దృష్టికి తీసుకువెళ్తా..



స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల పోస్టుల ఖాళీలతోపాటు ఇతర సమస్యలను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ దృష్టికి తీసుకువెళ్తాను. గతంలో మంత్రి చర్చించగా సానుకూలంగా స్పందించారు. డాక్టర్ల ఎంపిక చేపట్టగానే స్థానిక ఆసుపత్రికి వైద్యులను కేటాయిస్తానని హామీ ఇచ్చారు. రోగులకు అన్ని రకాల మందులు లభించే విధంగా చర్యలు తీసుకుంటాను.

– సునీతారెడ్డి, ఎమ్మెల్యే

ప్రభుత్వ బడుల్లోనే మెరుగైన వసతులు

మండల నోడల్ అధికారి విఠల్



చిలప్‌చెడ్(నర్సాపూర్): విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఉపాధ్యాయులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రభుత్వ బడులలోనే మెరుగైన వసతులు, నాణ్యమైన విద్య అందుతుందని మండల నోడల్ అధికారి విఠల్ అన్నారు. శుక్రవారం ఆయన చిలప్‌చెడ్ మండలం గౌతాపూర్ గ్రామంలో గల ఉన్నత పాఠశాలలో బాలసభ నిర్వహించి, ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుతామని వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

వెల్దుర్తి(తూప్రాన్): విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఎంపీపీ స్వరూప నరేందర్‌రెడ్డి అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పనతో పాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నారన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ విగ్నేశ్, ఎంఈఓ యాదగిరి, హెచ్‌ఎం సాంబయ్య పాల్గొన్నారు.

కొనసాగుతున్న బడిబాట

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంతోపాటు విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులను ఉపాధ్యాయులు అందజేశారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని సూచించారు.

19న తైబజార్ వేలం

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి పంచాయతీ ఆధ్వర్యంలో 19న తైబజార్ వేలం నిర్వహిస్తున్నట్టు ఈఓ వెంకటేశం తెలిపారు. గ్రామ ప్రత్యేక అధికారి నరేశ్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 11గంటలకు వేలం నిర్వహిస్తున్నామని, ఆసక్తి ఉన్నవారు రూ.50 రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

సోదర భావంతో మెలగాలి

డీఎస్పీ వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి

తూప్రాన్: ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని డీఎస్పీ వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. బక్రీద్ పండుగ సందర్భంగా పోలీస్‌స్టేషన్ ఆవరణంలో శుక్రవారం శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ, ముస్లింలు సోదరభావంతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ స్వామి, ఎస్‌ఐ శివానంద, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

రేబిస్ రాకుండా చర్యలు

పశువైద్యాధికారి వినోద్‌కుమార్

చిలప్‌చెడ్(నర్సాపూర్): రేబిస్ వ్యాధి రాకుండా చర్యలు చేపట్టామని మండల పశువైద్యాధికారి వినోద్‌కుమార్ చెప్పారు. శుక్రవారం ఆయన ఎంపీడీఓ ఆనంద్‌తో కలిసి చిలప్‌చెడ్ మండలం శీలాంపల్లి గ్రామంలో యాంటీ రేబిస్ టీకాల కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుక్కలు, పశువులకు యాంటీ రేబిస్ టీకాలు ఇవ్వడంవల్ల వాటిలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, అవి కరిచినా మనుషులకు ప్రమాదం ఉండదన్నారు. వెటర్నరీ అసిస్టెంట్ సురేశ్, పంచాయతీ కార్యదర్శి భూమేశ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఘనంగా అమ్మవార్ల ఉత్సవాలు**

నర్సాపూర్ రూరల్: మండల పరిధిలోని తుజాల్‌పూర్‌లోని శ్రీనల్ల పోచమ్మ, ముత్యాలమ్మ ఆలయాల మొదటి వార్షికోత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం అగ్నిగుండాలు, సాయంత్రం బోనాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు.

◆ **గోవధను అరికట్టాలంటూ వినతి**

మెదక్ కలెక్టరేట్/మెదక్ మున్సిపాలిటీ: గోవుల వధను అరిట్టాలని బీజేవైఎం మెదక్ పట్టణాధ్యక్షుడు సతీశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మెదక్ కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయంలో వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయానికి, మానవాళి ఆరోగ్య రక్షణకు గోవులు ఆధారమన్నారు. 1977లో గోరక్ష చట్టం తెచ్చినా అమలు కావడంలేదని వాపోయారు. కార్యక్రమంలో రాకేశ్, నరేందర్, రాహుల్, సన్నీ, సతీశ్, రాజు, సాయికుమార్ పాల్గొన్నారు.

◆ **పెద్దమ్మ తల్లికి ఎమ్మెల్సీ పూజలు**

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని రాజ్‌పేట పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి శుక్రవారం పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు శాలువాకప్పి సన్మానించారు. ఎంపీపీ శేరి నారాయణరెడ్డి, యామిరెడ్డి, ఎంపీటీసీలు దుర్గారావు, నార్ల సాయిలు, పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

◆ **పిల్లల ఎదుగుదల పరిశీలన**

చేగుంట(తూప్రాన్): అంగన్‌వాడీ సెంటర్లలోని పిల్లల ఎదుగుదలను సీడీపీఓ స్వరూప ఆధ్వర్యంలో శుక్రవారం పరిశీలించారు. ఆమె మట్లాడుతూ చిన్నారులతో పాటు బాలింతలు, గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారం తీసుకోవాలని, నిరంతరం వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో పిల్లలను పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు. సూపర్‌వైజర్ శైనీసువర్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

◆ **పేదలకు ఉచిత విద్య అందించాలి**

నర్సాపూర్: పేద పిల్లలకు ఉచితంగా విద్య అందించి వారి బంగారు భవిష్యత్తుకు దోహదపడాలని మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్, స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కె.అనిత పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణానికి చెందిన ఒంటరి మహిళ కావ్య తనకు ఇద్దరు పిల్లలున్నారని వారికి ఉచితంగా విద్య అందించేందుకు చర్యలు తీసుకోవాలని లీగల్ సర్వీస్ కమిటీ ప్రతినిధులను కలిసి అభ్యర్థించింది. వారు జడ్జి దృష్టికి తీసుకువెళ్లారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో చర్చించగా నలంద స్కూల్ యాజమాని నర్సింహారెడ్డి ఇద్దరు పిల్లలకు ఉచితంగా విద్య అందించేందుకు ముందుకు వచ్చారు. దండెపు వినోద్‌కుమార్ ఆ ఇద్దరు పిల్లలకు పుస్తకాలు కొనుగోలు చేసేందుకు ఆర్థిక సహాయం ప్రకటించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే సునీతారెడ్డి



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: తన దృష్టికి వచ్చే ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డి స్పష్టంచేశారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ తాను గతంలో ప్రకటించిన విధంగా ప్రతి శుక్రవారం ప్రజలకు అందుబాటులో ఉంటున్నానని చెప్పారు. ఆవంచకు చెందిన పలువురు రైతులు జగన్, రాములు, నర్సింహులు, మల్లేశ్, తిరుపతిరెడ్డి, లచ్చయ్య తదితరులు తమ బోరుబావులకు కేటాయించిన ట్రాన్స్‌ఫార్మర్‌ను మరో చోటుకు మార్పించాలని ఆమెకు వినతి పత్రం అందజేశారు. ఆమె సంబధిత శాఖ అధికారులతో మాట్లాడారు. భూమి సమస్య పరిష్కారించాలని, గురుకులాల్లో అడ్మిషన్లు ఇప్పించాలని పలువురు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రాలు అందజేశారు. దీంతో ఆమె స్పందించి ఆయా శాఖల అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ నాయకులు సత్యంగౌడ్, ప్రసాద్, జీవన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నిబంధనల ప్రకారం నష్టపరిహారం

ఆర్డీఓ రాజేశ్వర్ రెడ్డి



మాట్లాడుతున్న ఆర్డీఓ రాజేశ్వర్ రెడ్డి

నర్సాపూర్ రూరల్: భూ నిర్వాసితులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నష్టపరిహారం చెల్లిస్తామని ఆర్డీఓ రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం నర్సాపూర్ రైతువేదికలో శివంపేట మండలం గుండ్లపల్లి, పాంబండ, ఉసిరిక పల్లి, పోతుల గూడ, లింగోజిగూడ, కొత్తపేట గ్రామాల భూ నిర్వాసితులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూములు కోల్పోతున్న రైతులకు వారి భూముల వివరాలను తెలిపామని చెప్పారు. ఏవైనా తప్పులు ఉంటే తమకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తప్పులు ఉంటే విచారణ చేసి ఉన్నతాధికాలకు నివేదిస్తామని చెప్పారు.

సాదాసీదాగా మున్సిపల్ సమావేశం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ జ్యోతికృష్ణ

తూప్రాన్: మున్సిపల్ సాధారణ సమావేశం సాదాసీదాగా కొనసాగింది. మున్సిపల్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ జ్యోతికృష్ణ అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ప్రస్తుత వర్షాకాలంలో మున్సిపల్ పరిధిలోని 16వార్డుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. ప్రజలకు అనుకూలంగా వార్డు కౌన్సిలర్ సెల్ నంబరుతోపాటు అధికారుల నంబర్లతో కూడిన సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని, అలాగే మోడల్ దోబీఘాట్ ఏర్పాటు, నర్సాపూర్ రోడ్డు నుంచి బ్రాహ్మణపల్లి మీదుగా పడాల్‌పల్లి వరకు 60ఫీట్ల బీటీ రోడ్డు విస్తరణకు కలెక్టర్‌కు ప్రతిపదనల విషయంలో చర్చించి సభ్యులు ఆమోదం తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఖాజా మోహిజొద్దీన్, వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, మేనేజర్ రఘువరన్, కౌన్సిలర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చినుకు పడితే చెరువే..

- పాఠశాల ఆవరణలో నిలిచిన నీరు
- ఇబ్బందుల్లో విద్యార్థులు



చెరువును తలపిస్తున్న పాఠశాల ఆవరణ

అల్లాదుర్గం(మెదక్): చినుకు పడితే చాలు చెవ్వెర పాఠశాల ఆవరణ చెరువును తలపిస్తుంది. భారీ వర్షం కురిస్తే మోకాలులోతు నీటితో నిండిపోతుంది. మరుసటి రోజు తరగతి గదులు, ఆవరణ బురదమయంగా మారుతుంది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. ఈ పాఠశాల 161 జాతీయ రహదారి పక్కనే ఉండడంతో వర్షం నీరు పాఠశాలలోకి చేరుతుంది. రెండేళ్లుగా ఇదే పరిస్థితి ఏర్పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షాకాలంలో భారీగా వానలు కురిస్తే తమ చదువుల పరిస్థితి ఏమిటని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, నేతలు స్పందించి తమ ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతున్నారు.

డ్రమ్‌సీడర్‌తో ఖర్చులు తగ్గించుకోవచ్చు



విత్తనాలు అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

చేగుంట(తూప్రాన్): డ్రమ్ సీడర్‌తో వరి వేసుకుంటే నాట్ల ఖర్చులు తగ్గుతాయని సెహగల్ ఫౌండేషన్ ప్రోగ్రాం లీడర్ వాణి సూచించారు. మండలంలోని ఇబ్రహీంపూర్ మహిళ రైతులకు శుక్రవారం వరి విత్తనాలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రమ్ సీడర్ సాయంతో వరి వేసుకుంటే నారు, నాట్లకు సంబంధించిన ఖర్చులు తగ్గించుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సిబ్బంది విజయ్ శ్రవణ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్య భవితకు భరోసా

ఎంపీపీ మంజుల



రంగంపేటలో అక్షరాభ్యాస కార్యక్రమంలో ఎంపీపీ

కొల్చారం(నర్సాపూర్): ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం విద్యార్థుల భవితకు భరోసానిస్తుందని ఎంపీపీ మంజుల పేర్కొన్నారు. శుక్రవారం బడిబాటలో భాగంగా రంగంపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన అక్షరాభ్యాస కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమె హాజరయ్యారు. పిల్లలతో అక్షరాభ్యాసం చేపట్టారు. సంగాయిపేట గిరిజన తండాలో మధ్యలో చదువు ఆపేసిన ముగ్గురు ఆడపిల్లలను ఎంఈఓ నీలకంఠం, ఎంపీడీఓ లక్ష్మి నర్సింహులు కేజీబీవీ పాఠశాలలో చేర్పించారు. హెచ్‌ఎం శ్రావణి, శ్రీనివాస్, సాయికుమార్ పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చండూర్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రశేఖర్, విజయ్, శ్రావణి, అంగన్‌వాడీ టీచర్లు శశికళ, యాదమ్మ పాల్గొన్నారు.

చేగుంట(తూప్రాన్)లో: మండలలోని పలు గ్రామాల ప్రాథమిక పాఠశాలల్లో నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాల్లో హెచ్‌ఎం సురేష్, సత్యనారాయణ, రామకృష్ణ, శిరీష, అనిత, శ్రీలత పాల్గొన్నారు.

కాళ్లకల్‌లో: మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్లకల్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం, నోడల్ అధికారి వెంకటస్వామి, ఇన్‌చార్జి హెచ్‌ఎం కుమారస్వామి పాల్గొన్నారు.

చిన్నశంకరంపేట(మెదక్)లో: వివిధ గ్రామాలలోని ప్రాథమిక పాఠశాలలో జరిగిన అక్షరాభ్యాస కార్యక్రమాలలో హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, కాంప్లెక్స్ హెచ్‌ఎం సాయిరెడ్డి పాల్గొన్నారు.

నర్సాపూర్‌లో: హన్మంతాపూర్‌లోని మండల ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, ఎంఈఓ బుచ్చానాయక్, హెచ్‌ఎం రాంచందర్, ఏఏపీసీ చైర్మన్ పద్మ, అంగన్‌వాడీ టీచర్ పుష్ప తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్ రూరల్‌లో: మండలంలోని 43ప్రాథమిక పాఠశాల్లో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో లింగాపూర్ ఎంపీటీసీ శ్రీనివాస్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్)లో: బడిబాట కార్యక్రమంలో భాగంగా సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ అనురాధ తదితరులు పాల్గొన్నారు.